క్లుప్తంగా

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



చారకొండ: మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ అన్నారు. మండలంలోని సిర్సనగండ్లలో మంగళవారం పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. గ్రామంలో డంపిండ్‌యార్డు, కంపోస్ట్‌షెడ్ తదితర వాటిని సందర్శించారు. నర్సరీలో మొక్కల పెంపకం, వాటి నిర్వహణపై ఆరా తీశారు. అనంతరం గ్రామ పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మహేష్‌తో మాట్లాడారు. గ్రామంలో అభివృద్ధి, ఇతర సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వారి వెంట ఎంపీఓ వెంకటేష్ ఉన్నారు.

పశువులకు లంపిస్కిన్ వ్యాధి నివారణ టీకాలు

చారకొండ: గ్రామాల్లో ఆరు నెలలు పైబడిన పశువులు, ఆవులు, కోడెదూడలకు ముద్ద చర్మ(లంపి స్కిన్) వ్యాధి నిరోధక టీకాలను వేయించాలని పశు వైద్యాధికారి శివకుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ముద్ద చర్మ వ్యాధుల టీకాల పంపిణీ కార్యక్రమాన్ని పశువైద్య శాఖ ఆధ్వర్యంలో ప్రారంభించారు. మొత్తం 50 పశువులకు టీకాలు వేసినట్లు అధికారులు తెలిపారు. జూలై 10 వ తేదీ వరకు టీకాలు వేస్తామని రైతులు, కాపరులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో లైవ్ స్టాక్ ఆఫీసర్ మదర్, గోపాల మిత్ర శివరామ్, మల్లయ్య, గిరి తదితరులు ఉన్నారు.

శ్రీవారికి ప్రత్యేక పూజలు



చారకొండ: మండల కేంద్రంలో లక్ష్మీపద్మావతి వేంకటేశ్వరస్వామి దేవాలయం 15వ వార్షికోత్సవం ప్రారంభమయ్యాయి. మంగళవారం దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భగవద్గీత పారాయణం పాటించారు. అనంతరం తీర్థప్రసాదములు స్వీకరించారు. బుధవారం దేవాలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు, గ్రామస్తులు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

ప్లాస్టిక్ నిల్వ కోసం భవనం పరిశీలన



చారకొండ: మండల కేంద్రంలో డ్వాక్రా పాత భవనం వాడుకలో లేనందున ప్లాస్టిక్ నిల్వ కోసం భవనాన్ని మంగళవారం ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్, ఎంపీఓ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి గణేష్ పరిశీలించారు. భవనం ప్లాస్టిక్ నిల్వకు అవసరమగు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.

సారా తయారీ కేంద్రాలపై దాడులు



చారకొండ: మండల కేంద్రంలో మంగళవారం ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యంలో సారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించారు. 1000 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. దాడుల్లో ఎస్‌ఐలు వివేక్, సృజన్, సిబ్బంది మహేష్, సిరాజ్, నార్య, పరుశురామ్, మాధవి ఉన్నారు.

నియోజకవర్గ కమిటీ ఎన్నిక

కొల్లాపూర్: నియోజకవర్గ నాయీబ్రాహ్మణ సంఘం నూతనం కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని జైభీమ్ కాలనీలో గల నాయీబ్రాహ్మణ కమ్యూనిటీ హాల్‌లో వివిధ గ్రామాల నుంచి వచ్చిన నాయీబ్రాహ్మణులు సమావేశం అయ్యారు. పలు అంశాలపై చర్చించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా ఎన్.బాలరాజు, ఉపాధ్యక్షుడిగా తుపాకుల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్, సోషల్‌మీడియా ఇన్‌చార్జిగా తుపాకుల భరత్‌కుమార్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంజన్న, రమేష్, వెంకటేష్, రాము, నర్సింహ్మ, సుధాకర్, శేఖర్ తదితరులున్నారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంతత

తాడూరు: ఆధ్యాత్మికతతో ప్రశాంతత కలుగుతుందని ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పొల్మూరులో సద్గురు పరిపూర్ణానంద సుదర్శన్‌రెడ్డి రెండో ఆరాధన మహోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలన్నారు. ఆరాధన ఉత్సవాల్లో సుదర్శనహోమం నిర్వహించడం గొప్పవిషయమన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. భక్తిభావంతో సన్మార్గం అలవడుతుందన్నారు. అంతకుముందు గురువు విగ్రహానికి పూలమాల వేసి పూజలు చేశారు. జెడ్పీటీసీ రోహిణి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వల్లభ్‌రెడ్డి, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, జంగిరెడ్డి, మాజీ సర్పంచ్ రాములు, భక్తులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా 12769 గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పంచాయతీ కార్మికులచేత వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని ఆరోపించారు. 7 నెలలుగా వేతనాలు ఇవ్వకపోతే కుటుంబాలను ఎలా పోషిస్తారని ప్రశ్నించారు. తక్షణం ప్రభుత్వం స్పందించి కార్మికులకు కనీస వేతనాలు అమలు చేసి, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి పాదిలరామయ్య, గ్రామ పంచాయితీ వర్కర్స్ జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణ, తిరుపతయ్య, వెంకట్‌రెడ్డి, స్వామి, మైబూసు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ కార్యాలయంలో పంచాయతీ అధికారికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

లబ్ధిదారులు అర్హులుగా నమోదు చేసుకోవాలి



చారకొండ: ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకొని, ప్రభుత్వ పథకాలకు విద్యుత్, గ్యాస్ పథకాలకు అర్హులుగా ఎంపిక కాని వారు మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాపాలన రశీదుతో పాటు, గ్యాస్, విద్యుత్ సంబంధిత వాటిని పొందుపరిచి అర్హులుగా నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ అన్నారు. మండలంలోని మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రభుత్వ పథకాలకు ఎంపికకు నమోదును చేపట్టారు. మండలంలోని ఆయా గ్రామాల లబ్ధిదారులు అర్హులుగా ఎంపిక కానివారు నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ పేర్కొన్నారు.

అక్రమ ఇసుక తరలింపును నిలిపివేయాలి

ఉప్పునుంతల: మండలంలోని మొల్గర వద్ద దుందుబీ వాగు నుంచి ఇసుకను అక్రమ తరలింపును నిలిపివేయాలని పెద్దాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు వేముల నర్సింహ్మారావు మంగళవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గత నవంబర్ నెలలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో అక్రమంగా అనుమతి పొందిన కొంతమంది విచ్చలవిడిగా టిప్పర్లతో ఇసుకను తరలించి సొమ్ముచేసుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ వ్యక్తులు బినామీల పేరిట ఆన్‌లైన్‌లో ఇసుక అనుమతులు పొంది వాగు నుంచి ఇసుకను టిప్పర్లతో తరలించి సొమ్ము చేసుకుంటున్నారని వివరించారు. ఇసుక అక్రమ రవాణాపై విచారణ చేసి సంబంధిత వ్యక్తులతోపాటు వారికి సహకరిస్తున్న మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఎరువులు అందుబాటులో ఉంచాలి



తాడూరు: సింగిల్‌విండో సిబ్బంది రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలని సింగిల్ విండో చైర్మన్ కే రామచంద్రారెడ్డి కోరారు. మంగళవారం సింగిల్‌విండో గోదాంలోని ఎరువులను పరిశీలించి సెలవు రోజుల్లో కూడా గోదాం తెరిచి ఉంచి ఎరువుల కోసం వచ్చే రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఎరువులు, విత్తనాలు రైతులకు అందించాలన్నారు. స్టాక్ వివరాలు రికార్డులలో నమోదు చేయాలన్నారు. ఎలాంటి అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఈఓ ఆంజనేయులు, సిబ్బంది, రైతులు ఉన్నారు.

డీఎంకు వినతి

పెద్దకొత్తపల్లి: వెనచర్ల గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని మాలమహానాడు వడ్డెర సంఘం ఆధ్వర్యంలో డిపో మేనేజర్ వెంకటేష్ గౌడ్‌కు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. నక్కలపల్లి నుంచి వెనచర్ల, నాగపూర్, కొత్తరాయిపాకుల, శానాయిపల్లి, గుడిపల్లి, జొరేష్‌పల్లి, నాగనూల్ మీదుగా నాగర్‌కర్నూల్‌కు వెళ్లి నాలుగు ఆర్డీనరి బస్సులు నడిపేవారని వివరించారు. ఈ బస్సులను రద్దు చేయడంతో ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని పేర్కొన్నారు. బస్సులను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకర్, లక్ష్మన్నస్వామి, సుబ్బయ్య, వడ్డెరం సంఘం అధ్యక్షుడు నవీన్, నిఖిల్ పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి

కొల్లాపూర్: మొలచింతలపల్లిలో చెంచు మహిళ ఈశ్వరమ్మపై దాడికి పాల్పడ్డ వారిని కఠినంగా శిక్షించాలని తెలంగాణ మాదిగ దండోరా జిల్లా అధ్యక్షుడు దేవని కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈశ్వరమ్మపై దాడికి పాల్పడ్డ నిందితులను రక్షించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. చెంచు నాగన్న మృతిపై కూడా విచారణ జరిపించాలన్నారు. సమావేశంలో నాయకులు శీలం వెంకటేష్, కురుమయ్య తదితరులున్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



పెంట్లవెల్లి: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం కలుగుతుందని డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని వైద్యశాలలో ఆయన మాట్లాడారు. మురుగుకాల్వలు శుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. అపరిశుభ్రత ద్వార దోమలు, ఈగలు ఎక్కువగా వ్యాప్తిస్తాయని దీంతో మలేరియా, టైఫాయిడ్, కలరా వ్యాధులు సంక్రమిస్తాయని వివరించారు. ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు ఇంటింటికి తిరిగి ప్రజలకు ఆరోగ్యంపై జాగ్రత్తలు తెలపాలని కోరారు.

పథకాల అమలుపై ప్రభుత్వం దృష్టి

పెంట్లవెల్లి: ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను అమలు చేసేందుకు ప్రభుత్వం దృష్టి సారించిందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మదుగం నర్సింహయాదవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ పెంపు, ఉచిత విద్యుత్ అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో మూలె కుమార్, శేఖర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

డీఈఓకు ఫిర్యాదు

పెద్దకొత్తపల్లి: స్టూడెంట్ ఆర్గనైజర్ పేరుతో చలామణి అవుతున్న నాయకులకు చందాలు ఇవ్వకపోవడంతోనే ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలను వేధిస్తున్నారని మంగళవారం ప్రైవేటు స్కూళ్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ డీఈఓ గోవిందరాజులుకు ఫిర్యాదు చేశారు. పట్టణంలో స్టూడెంట్ ఆర్గనైజర్ నాయకులు ఎంఈఓ ఆఫీసు సిబ్బందితో వెళ్లి సోమవారం రెండు ప్రైవేటు స్కూళ్లలో స్టోర్ రూంలను సీజ్ చేసిన విషయం విధితమే. ఈ సందర్భంగా ఆయన డీఈఓను కలిసి నిబంధనల మేరకే ప్రైవేట్ స్కూళ్లు నడిపిస్తున్నట్లు డీఈఓ దృష్టికి తీసుకెళ్లారు. కొందరు విద్యార్థి సంఘాల నాయకులు వసూళ్లకు పాల్పడుతూ వేధిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ రాజు, నాగర్‌కర్నూల్ టౌన్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్‌రావు, గీతాంజలి డైరెక్టర్ నరేష్‌జ్యోషాపురాయి, రఘుపతిరెడ్డి పాల్గొన్నారు.



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ప్రైవేట్ స్కూల్ యూనియన్ నాయకులు

నాగర్‌కర్నూల్: పుస్తకాల విక్రయానికి ఆటంకం కలిగించొద్దని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు మంగళవారం డీఈఓ గోవిందరాజులకు ఆయన కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల మేరకు మాత్రమే పుస్తకాలు విక్రయిస్తున్నట్లు తెలిపారు. తస్మా సభ్యులు, నాయకులు ఉన్నారు.

ఉపాధిహామీ చట్టాన్ని కాపాడుకుందాం

తెలకపల్లి: ఉపాధిహామీ చట్టాన్ని కాపాడుకుందామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు నందిపేట భాస్కర్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26న యోగా భవనంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా శిక్షణ సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా రాష్ట్రవ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు బి ప్రసాద్ హాజరవుతారన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు రామకృష్ణ, కేవీపీఎస్ మండల అధ్యక్షుడు కాశన్న, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పి లారీ బోల్తా



చారకొండ: అదుపు తప్పి లారీ బోల్తా పడిన ఘటనలో మండలంలోని మర్రిపల్లి బస్ స్టేజి వద్ద జడ్చర్ల - కోదాడ జాతీయ రహదారిపై మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం దేవరకొండ నుంచి బియ్యం లోడ్‌తో కల్వకుర్తి వైపు వెళ్తున్న లారీ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొని బోల్తా పడింది. చెక్‌పోస్టులు డ్రమ్ములను ఢీకొని పక్కనే ఉన్న బస్ స్టేజీ వద్ద ఉన్న మహిళ శాంతికి డ్రమ్ములు తగిలి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మహిళా భర్త ధర్మ నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ నాగయ్య తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన



తాడూరు: మండలంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్‌ఐ స్వామి పలు గ్రామాల ప్రజలకు సైబర్‌నేరాలపై మంగళవారం అవగాహన కల్పించారు. గుర్తుతెలియన్ నంబర్లనుంచి ఫోన్ వస్తే వ్యక్తిగత వివరాలు చెప్పొద్దన్నారు. అనుమానిక వ్యక్తులు సంచరిస్తే హెల్ప్‌లైన్ 1930, 100 డయల్ చేయాలని కోరారు. అపరిచిత వ్యక్తులతో సోషల్‌మీడియాలో స్నేహం చేయొద్దన్నారు. పలు గ్రామాల ప్రజలు, సిబ్బంది ప్రతాప్, విష్ణు పాల్గొన్నారు.

చెంచుగూడెంలో ఉచిత వైద్య శిబిరాలు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని మొలచింతలపల్లి, అమరగిరి గ్రామాల సమీపంలో ఉన్న చెంచుగూడెంలో పెంట్లవెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులకు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డెంగ్యూ, మలేరియా, వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, చెంచులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల నమోదు ఏది?

లింగాల: కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారంటీల అమలుకు గత జనవరిలో నిర్వహించిన ప్రజాపాలనలో ప్రజలు చేసుకున్న దరఖాస్తులు అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదని తెలిసింది. 6 గ్యారంటీలలో ఒకటైన జీరో కరెంటు బిల్లులు అంశం కూడా ఉంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 200 యూనిట్ల లోపు వారికి జీరో కరెంటు బిల్లులు విద్యుత్ శాఖ వారు ఇస్తున్నారు. కాగా జీరో బిల్లులు మండలంలో చాలా వరకు వినియోగదారులకు రాక పోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీరో బిల్లులు రాని వారు మండల పరిషత్ కార్యాలయంలో వివరాలు ఇవ్వాలని అధికారులు సూచించడంతో ప్రజలు ప్రజాపాలనలో ఇచ్చిన వివరాలతో పాటు అప్పట్లో ఇచ్చిన రసీదును తీసుకొని ఎంపీడీఓ కార్యాలయంలో సంప్రదించగా ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తులు ఆన్‌లైన్‌లో చాలా వరకు నమోదు చేయని విషయం వెలుగులోకి వచ్చింది. కొంత మంది పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యం వలన తాము ఇచ్చిన దరఖాస్తులు బుట్టదాఖలా అయ్యాయని ప్రజలు విమర్శిస్తున్నారు. ఈ విషయంపై ఎంపీడీఓ ఆంజనేయులు వివరణ ఇస్తూ ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని, అర్హులైన వారు మండల పరిషత్ కార్యాలయంలో అన్ని వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నేడు సర్వసభ్య సమావేశం

తాడూరు: మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తునట్లు మంగళవారం ఎంపీపీ శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు.

వర్షపు నీటిని ఒడిసిపట్టాలి



వెల్దండ: వర్షపు నీరు వృథాకాకుండా ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టాలని ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో నీరు వృథా వెళ్లిపోతుందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంకుడు గుంతలను నిర్మించాలన్నారు. అనంతరం కార్యదర్శులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీఓ సునీత, ఏపీఓ ఈశ్వర్‌జీ, ఈసీ దేవేందర్‌గౌడు, టీఏలు, కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

కేజీబీవీ నూతన భవనం పరిశీలన



అమ్రాబాద్: మండలంలోని తెలుగుపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం నూతన భవనాన్ని మంగళవారం అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సందర్శించి పరిశీలించారు. రూ. 3 కోట్లతో నిర్మిస్తున్న ఈ భవనం పూర్తి అయినప్పటికి ఇంకా మిగిలి ఉన్న పనులు పూర్తి చేయాలని ఆయ సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీపీ శ్రీనివాసులు, మండల అధ్యక్షుడు హరినారాయణగౌడ్, మండల విద్యాధికారి బాలకిషన్ తదితరులు ఉన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

అచ్చంపేట రూరల్: పట్టణంలోని సర్వే నెంబర్ 213లో ఉన్న ఇళ్ల స్థలాలను పేదలకు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దేశ్యా నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో సర్వే నంబర్‌లో సీపీఎం జెండాలతో నిరసన వ్యక్తం చేశారు. 2007లో సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేయడంతో అప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చారన్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయించిన ఇళ్ల స్థలాల్లో డబుల్‌బెడ్రూం ఇళ్లు నిర్మించారన్నారు. మిగిలిన ఖాళీ స్థలంలో స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకు న్యాయం జరిగే వరకు సీపీఎం ఆధ్వర్యంలో పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శంకర్‌నాయక్, మల్లేష్, నిర్మల, తిర్పతమ్మ, వరలక్ష్మి, సైదులు, మల్లమ్మ, శంకర్, హుస్సేన్ పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయంతో లాభాలు

పెద్దకొత్తపల్లి: ఆధునిక వ్యవసాయంతో లాభాలు పొందవచ్చని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం రైతునేస్తంలో భాగంగా ఆయన హైదరాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్‌లో నిర్వహించారు. రుణమాఫీపై రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్‌రావు, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, ఉదయ్‌కుమార్, ఏఈఓలు శ్రీరాం, రమేష్, రవికుమార్, రైతులు నాగపూర్ విష్ణు, శ్రీనివాస్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రాజశేకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వెల్దండ: మండలంలోని రాచూర్ రైతు వేదికలో హాజరైన అధికారులు, రైతులతో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పంటల సాగు, విత్తనాల నాణ్యత, ఎరువుల వినియోగం తదితర వాటాపై వివరించారు. పంటలకు సోకే తెగుళ్ల నివారణ, అధిక దిగుబడి పొందే విధంగా తీసుకోవాల్సిన జాగ్రతలను శాస్త్రవేత్తలు తెలిపారు. కార్యక్రమంలో కల్వకుర్తి డివిజన్ వ్యవసాయ అధికారి కిరణ్‌కుమార్, డివిజన్ ఏఓలు మంజుల, చిన్నఉస్సేన్, శోభారాణి, శ్రీలత, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించండి

దోమలపెంట: రాష్ట్రంలో ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎస్పీడీసీఎల్ తదితర సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగ, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం రాత్రి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు స్టేట్ పవర్ ఎంప్లాయిస్(1535) యూనియన్ వైస్ ప్రెసిడెంట్ సుంకరి లవకుమార్ వినతిపత్రం అందజేశారు. భూగర్భ కేంద్రం స్థితిగతులపై సమీక్షా సమావేశం నిర్వహణకు వచ్చిన భట్టి విక్రమార్కను కేంద్రంలో ఆ యూనియన్ నాయకులు కలిసి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

తాత్కాలికంగా నిరవధిక సమ్మె విరమణ



నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో న్యాయమైన డిమాండ్‌ల పరిష్కారం కోరుతూ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెను మంగళవారం తాత్కాలికంగా విరమించారు. ఈ సందర్భంగా తెలంగాణ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి సురేష్ మాట్లాడుతూ జీఓ నెంబర్ 60 ప్రకారం కార్మికులకు పెంచిన కొత్త వేతనాలను తక్షణమే అమలు చేయాలన్నారు. కార్మికుల సంఖ్య పెంచి కార్మికులకు పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయంలో వైద్య విద్యా సంచాలకులు ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు ఆర్ఎంఓ డా హాజీం కార్మికుల సమ్మెను విరమింపజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మారేడు శివశంకర్, డా దశరథ్, కార్మికులు బాలకిష్టమ్మ, నాగమని, సంతోష, మణెమ్మ, గౌరమ్మ, రాజుగౌడ్, నిరంజన్ ఉన్నారు.

పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలి

కొల్లాపూర్: ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని బీఆర్ఎస్‌వీ జిల్లా నాయకులు ధారా శేఖర్, గిరిజన సంఘం మండల అధ్యక్షుడు తిరుపతినాయక్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఎంఈఓ కార్యాలయ ఉద్యోగికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పట్టణంలో యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలను అధిక ధరలకు విక్రయిస్తున్న పాఠశాలలపై చర్యలు చేపట్టాలన్నారు. పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, నాగరాజు, సాయి, కార్తీక్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.